క్లుప్తంగా

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గొల్లప్రోలు: జ్యేష్ఠ మాసంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా మరిడమ్మ తొలి గరగ ఉత్సవం



మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న గరగల నృత్యం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో తొలి గరగ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గరగ ఉత్సవాన్ని నిర్వహించినట్టు తెలిపారు. 15వ తేదీన పందిరి రాట మూహూర్తం ఉంటుందని ఈఓ రామ్మోహనరావు పేర్కొన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన జాతర మహోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని ఆయన కోరారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి కాలినడకను వచ్చి ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

11న సత్రం భూముల కౌలుకు వేలం

కరప: మండలం వేళంగిలోని పాతూరి బుల్లి వెంకయ్యమ్మ సత్రానికి చెందిన భూములు కౌలుకు సాగుచేసుకునేందుకు ఈనెల 11న ఉదయం 9 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు గ్రేడ్‌-1 ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు శనివారం తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధీనంలోని పాతూరి బుల్లివెంకయ్యమ్మ సత్రానికి సంబంధించిన 21 ప్రతులుగా ఉన్న 55.89 ఎకరాలకు విడివిడిగా (ఒక్కొక్క ప్రతికి) మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు సాగుచేసుకునే నిమిత్తం సత్రం ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.10 వేలు, రూ.3 వేలు, రూ.వెయ్యి వంతున ఆయా ప్రతులకు ప్రథమ ధరావతుగా చెల్లించాలన్నారు. హెచ్చుపాటదారుడు ప్రథమ ధరావత్తు సొమ్ము కాకుండా ఒక సంవత్సరం మగతా సొమ్మును నగదురూపంలో పాటకొట్టి వేసిన వెంటనే చెల్లించాలన్నారు. ఏకారణం చేతనైనా పాట నిలుపుదలకు, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందన్నారు. మిగిలిన వివరాలు సత్రంలోని దేవస్థానం సిబ్బందిని అడిగి తెలుసుకోవాలని ఈఓ మురళీ వీరభద్రరావు సూచించారు.

ప్రపంచ స్నేహితుల దినోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో ప్రపంచ ఉత్తమ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఎందరికో సేవలందించిన వైద్యులను అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర చైతన్య సిరాజ్, వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఆవకాయ!

- భారంగా మారిన ఆంధ్రా స్పెషల్ ఆవకాయ తయారీ
- తగ్గిన మామిడి దిగుబడి
- పెరిగిన మిర్చి, మసాలా దినుసుల ధరలు



పిఠాపురంలో ఆవకాయ పచ్చడికి మామిడి ముక్కలు కోస్తున్న మహిళ



పచ్చళ్ల కోసం ఇతర ప్రాంతాలకు పంపేందుకు సిద్ధం చేస్తున్న పచ్చి మామిడి కాయలు

పిఠాపురం: వేసవి వచ్చిందంటే చాలు ఉభయ గోదావరి జిల్లాలోని ప్రతిఇంటా ఆవకాయ పచ్చడి ఘుమఘుమలు వెదజల్లుతాయి. పట్టణం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని ఆవకాయ ఆహ్వానిస్తుంటే ఊరగాయలు ఊరిస్తాయి. ఆంధ్రులంటే ఆవకాయ గుర్తుకొస్తుంది. ఆవకాయ ఆంధ్రాలో పుట్టి దక్షిణ భారతదేశంలో ప్రశిద్ధి పొందింది. కొత్త ఆవకాయ పేరు వింటేనే నోరూరిపోతుంది. వేసవిలో వేడిసెగలు కుక్కుతున్నా వడగాడ్పులు వీస్తున్నా ఆంధ్రాలో ప్రతి ఇంటా ఆవకాయ పచ్చడి తయారీ మాత్రం జోరుగా సాగుతుంది. రుచిలో ఉన్నట్లే దీని తయారీ సైతం ఒక పెద్ద ప్రహసనమే అని చెప్పొచ్చు. వేసవిలో పప్పు, నెయ్యి, ఆవకాయ కాంబినేషన్‌తో భోజనాలు తప్పనిసరిగా ఉంటాయి. అలాంటి ఆవకాయ పచ్చడి తయారీ ప్రస్తుతం పెనుభారంగా మారింది. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన మామిడి, కారం, మసాలా దినుసుల ధరలు ఆవకాయ తయారీకి అడ్డంకిగా మారాయి.

ధరలకు రెక్కలు

పచ్చళ్లకు ఉపయోగించే చెరకు రసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టరు మామిడి కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం వల్ల వాటికి మంచి గిరాకీ ఏర్పడింది. ఆరోగ్య ప్రదాయినిగా చెప్పబడే మామిడిని తినని వారుండరు. ముఖ్యంగా పీచు అధికంగా గల బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి మామిడి పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. కలెక్టరు, కొబ్బరిమామిడి వంటి పచ్చి మామిడి కాయలను ఊరగాయలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అందువల్ల మామిడి సీజన్ ప్రారంభంలోనే వీటికి గిరాకీ పెరుగుతుంది. ఊరగాయలకు ఉపయోగించే కేజీ పచ్చి మామిడి కాయలు రూ.45 నుంచి రూ.55 వరకూ ధర పలుకుతోంది.

48 వేల హెక్టార్లలో మామిడి సాగు

జిల్లాలో ఏజెన్సీ మెట్ట ప్రాంతాలతో పాటు పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 48 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం మామిడి కాయలు, పండ్లను కాకినాడ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. నిత్యం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 టన్నులకు పైగా మామిడి కాయల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆవకాయ పచ్చడికి ఎక్కువగా ఉపయోగించే కొత్తపల్లి కొబ్బరి మామిడి 100 కాయలు రూ.6 వేలు పలుకుతున్నాయి. సాధారణ రకాలైన రసాలు ధర ఒక్కో కాయ గతేడాది రూ.20 ఉండగా ఈ ఏడాది రూ.36కు పెరిగింది. సువర్ణరేఖ రూ.12 నుంచి రూ.25కు పెరిగింది. చిన్న రసాల ధర రూ.15 నుంచి రూ.25కు పెరిగింది. దేశవాళీ రకం మామిడి కాయలు ధర రూ.10 నుంచి రూ.25 వరకు పెరగడంతో ఆవకాయతో పాటు నిల్వ పచ్చళ్ల తయారీ సైతం సామాన్యులకు పెనుభారంగా మారింది. వీటికి తోడు పచ్చళ్లలో ఉపయోగించే ఎండు మిర్చి, ఆవాలు, వెల్లుల్లి వంటి మసాలా దినుసుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పచ్చళ్ల తయారీ పెనుభారంగా మారిపోయింది.

ఆవకాయ పచ్చళ్లలో రకాలు

తీపి ఆవకాయ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేకం. ఆంధ్రా ఆవకాయ గోదావరి జిల్లాలకు ప్రత్యేకం. ఆవ పిండితో పెట్టే ఆవకాయతో పాటు అల్లం ఆవకాయ, బెల్లం ఆవకాయ, మాగాయ, కాయ ఆవకాయ, పులిహోర ఆవకాయ, పెసర ఆవకాయ, నువ్వు పొడి ఆవకాయ, మెంతి ఆవకాయ, తురుము మాగాయ, నీళ్ల ఆవకాయ, కొబ్బరి ఆవకాయ, పచ్చ ఆవకాయ, తొక్కు మాగాయ, శనగల ఆవకాయ, వెల్లుల్లి ఆవకాయ, ఉడుకు మాగాయ, పిందె మాగాయ, ఎండు ఆవకాయ వంటి ఎన్నో రకాల పచ్చళ్లను పెడతారు.

సాధారణంగా వ్యాపారులు దుఖానాల్లో అమ్మే కారంతో పచ్చళ్లు తయారు చేస్తారు. కాని గృహాల వద్ద సొంతంగా తయారు చేసుకునే వారు మాత్రం పచ్చడికి వాడే కారంలో అత్యంత జాగ్రత్తలు పాటిస్తారు. నాణ్యమైన మిరప కాయలనే కొని బాగా ఎండబెట్టి ఇళ్ల వద్దే గ్రైండ్ చేసుకుని పచ్చడికి వాడుతుంటారు. మిరప పంటకు పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో మిరప సాగుతో పాటు దిగుబడి సైతం భారీగా పడిపోయింది. దీంతో మిర్చి రేటు సైతం ఘాటెక్కింది. పచ్చడి మిర్చి ధర కేజీ రూ.300 పలుకుతుండగా ఒక కేజీ కారం తయారీకి రూ.800 వరకూ ఖర్చవుతుండడంతో పచ్చడి తయారీ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **మామిడి దిగుబడి తగ్గింది**
>
> 
>
> ఈ ఏడాది మామిడి దిగుబడులు బాగా తగ్గాయి. పెట్టుబడులు పెరిగాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో పూత నిలబడలేదు. మామిడికి డిమాండ్ పెరగడంతో రేటు బాగున్నప్పటికీ దిగుబడి లేక రాబడి తగ్గిపోయింది. ముఖ్యంగా పచ్చళ్లకు వాడే కొత్తపల్లి కొబ్బరి, రసాలు, సువర్ణరేఖ వంటి రకాల దిగుబడి తక్కువగా ఉంది. తెగుళ్ల విజృంభించడంతో కాయల్లో నాణ్యత లేక కొనుగోళ్లు మందగించాయి.
>
> – పదిలం రామన్నదొర, మామిడి రైతు, గొల్లప్రోలు మండలం

పట్టుదల, ఏకాగ్రతతో లక్ష్యసాధన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ప్రొఫెసర్లు

సామర్లకోట: సమన్వయపాలన, ఏకాగ్రత, పట్టుదల లక్ష్య సాధనకు మెట్లుగా ఉంటాయని పలువురు ప్రొఫెసర్లు అన్నారు. స్థానిక వీర్రాఘవపురంలోని ఐఈఎం చర్చిలో హైస్కూల్ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక మోటివేషన్ తరగతిని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ డి ఇజ్రాయేల్, విజయవాడకు చెందిన క్రిస్టియన్ కౌన్సిలింగ్ ఫర్ అకడమిక్ ఎక్స్‌లెన్స్ సంస్థ చెందిన మోటివేటర్ డాక్టరు ఉచ్చుల సత్యానందం మాట్లాడుతూ ఏ విద్యార్థి అయితే వీటిని పాటిస్తారో వారు ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. విశాఖపట్నం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు సత్యనారాయణ, కాకినాడ జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఇబ్రహీం పాల్గొని విద్యార్థులకు ప్రత్యేక ప్రశ్నాపత్రాలు ఇచ్చి వాటి నుంచి సమాధానాలు రాబట్టి వారి పరిజ్ఞానాన్ని అంచనా వేసి అవసరమైన సూచనలు, భవిష్యత్ విద్యా ప్రణాళికలకు సంబంధించిన ప్రణాళికలను వివరించారు.

ప్రత్యేక హోదాతోనే ఏపీ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

పెద్దాపురం: ప్రత్యేక హోదాతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో శనివారం రైతుకూలీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ విభజన అనంతరం నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎంతో అవసరమన్నారు. హోదా సాధనకు ప్రజలు కూటమికి పట్టం కట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా హోదా సాధించాలన్నారు. సమావేశంలో వల్లూరి రాజుబాబు, కడితి సతీష్, దేశెట్టి సురేష్, కుంచే అంజిబాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీసీసీ వేసవి శిబిరం ముగింపు

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్ 9వ తేదీన ముగియనున్నట్టు శిబిరం అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్‌లు తెలిపారు. శనివారం పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శిక్షణ ఇచ్చే రిసోర్సు పర్సన్లు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా శిక్షణ ఇచ్చారన్నారు. సమావేశంలో రవికుమార్, పూజిత, మణికంఠ, బంగారం తదితరులు పాల్గొన్నారు.

రాజప్పకు పలువురి అభినందనలు



రాజప్పకు శుభాకాంక్షలు చెప్తున్న రామన్నచౌదరి

సామర్లకోట: నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్పకు శనివారం పలువురు అభినందనలు తెలిపారు. శనివారం అచ్చంపేటలోని ఆయన స్వగృహానికి వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్పీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి, వ్యవసాయశాఖ అధికారులు ఎం.రత్నప్రశాంతి, సంజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణచౌదరి, అచ్చంపేట సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు పాల్గొన్నారు.

పత్తి సాగుకు రెడీ

- దుక్కులు చేసి భూములను సిద్ధం చేసిన రైతులు
- నెలాఖరుకు నాట్లు పూర్తి చేసేలా సన్నాహాలు



ఎస్.చామవరంలో పత్తి సాగుకు ట్రాక్టర్‌తో దుక్కు చేస్తున్న దృశ్యం

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు పత్తి సాగుకు భూములను సిద్ధం చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ వారంలో నాట్లు ప్రారంభించి నెలాఖరుకు పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కాకినాడ జిల్లాలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, పత్తిపాడు, గొల్లప్రోలు, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, ఏలేశ్వరం మండలాల్లో ప్రతి సంవత్సరం రైతులు పత్తిసాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో గతేడాది ఐదు వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉండడంతో ఈసారి మరింత ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పత్తిసాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నారు. తుని మండలంలోని ఎస్.చామవరం, వి.కొత్తూరు, ఎ.అగ్రహారం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, హంసవరం, ఎస్.అన్నవరం, చేపూరు, గవరపేట, టి.వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు పత్తిసాగు ఎక్కువగా చేస్తారు. ఈ ఏడాది రైతులు ఇప్పటికే పత్తిసాగుకు దుక్కులు పూర్తి చేశారు. విత్తనాలు నాటిన తర్వాత నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా పత్తినాట్లు వేస్తారు.

ధారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి



ధారపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి జలపాతం వద్ద శనివారం యాత్రికులు సందడి చేశారు. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడం, రెండో శనివారం సెలవు దినం కావడంతో ధారపల్లి జలపాతానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో సహా జలపాతం వద్ద ఆటపాటలతో గడిపారు. జలపాతం వద్ద సాయంత్రం వరకూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. యువత ఆట పాటలతో సందడి చేశారు.

సాగరజలాలను సంరక్షించాలి



బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్

కాకినాడ రూరల్: సముద్ర జలాలు కలుషితం కాకుంటేనే జీవరాశులు బాగుంటాయని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేడియా అల 90.8 ఎఫ్‌ఎం, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథి పాల్గొన్న ఆయన విద్యార్థులతో కలసి వ్యర్థాలను తొలగించారు. మరో అతిథి రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడీ రామారావు, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ (హెన్) ప్రాజెక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డీఎస్ మూర్తి, వైద్యుడు కాద వెంకటరమణ, సామాజిక వేత్త వక్కలంక రామకృష్ణ, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ చాప్టర్ కో ఆర్డినేటరు డాక్టరు ఎస్.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ సముద్ర జలాల నాణ్యత ఆవశ్యకతను వివరించారు.

మనసులు మురిసె మృగశిరాన

- ఎండలకు అల్లాడిన తనువులకు వానాకాలపు పులకింత
- మాంసాహార ప్రియులకు ఇష్టమైన కాలం



కాకినాడ సిటీ: వేసవి కాలం వచ్చిందంటే భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండల తీవ్రత విపరీతంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వేసవిలో వచ్చే రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. దీని తర్వాత వచ్చే మృగశిర కార్తెకు ఎంతో ప్రాధాన్యం ఉంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం మనకు 27 నక్షత్రాలు. సూర్యుడు ఒక్కో నక్షత్రంలో ప్రవేశించడాన్ని బట్టి ఆ నక్షత్రం పేరిట కార్తెలు ఏర్పడతాయి. మృగశిర కార్తెను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా జరుపుకొంటారు. మృగశిర కార్తె అనగానే తొలుత గుర్తుకు వచ్చేది చేపలు ఈ కార్తె ఆరంభం రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తెతో వేసవి కాలం దాదాపు ముగిసి వర్షాకాలం మొదలైందని భావిస్తారు.

ఊపిరి పీల్చుకున్న ప్రజలు

విపరీతమైన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు వృద్ధి చెందాలని, అన్నదాతల ఇంట సిరులు పండాలని కోరుకుంటూ మృగశిర కార్తె శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నైరుతి రుతుపవనాల ఆగమనం సైతం మొదలై శుక్రవారం, తెల్లవారుజామున జిల్లాలో భారీ వర్షం కురిసింది. వ్యవసాయ ఆధారిత దేశమైన భారతదేశంలో నైరుతి రుతుపవనాల రాకతో వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. పంటలు పండటానికి అవసరమైన వర్షాలు కురవడం ప్రారంభమయ్యేది ఈ మృగశిర కార్తెలోనే.

ఆరోగ్య సమస్యలకూ పరిష్కారం

మృగశిర కార్తెలో ఎండల నుంచి ఉపశమనం కలుగుతుంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పు వస్తుంది. సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం, అస్థమా వంటి రోగాలు వ్యాపిస్తాయి. దీంతో మృగశిర కార్తె ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో బెల్లంలో ఇంగువ కలిపి తింటారు. దీని ద్వారా శరీరంలో ఉష్ణోగ్రతను ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను రాకుండా చేస్తుందని పెద్దలు నమ్ముతారు.

నల్ల నాటు కోళ్లకు డిమాండ్

మృగశిర కార్తె రాకతో వాతావరణంలో మార్పులు రావడం సహజం. మబ్బులు కమ్మే నల్లటి ఆకాశం కనిపిస్తుంది. దీంతో అనాదిగా నల్లటి రంగు మృగశిర కార్తెకు గుర్తుగా నిలుస్తుంది. ఈ కార్తెలో నల్లటి రంగులో ఉన్న కోళ్లు, పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్. సాధారణంగా లభించే బ్రాయిలర్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 ఉంది. నాటుకోళ్లకు మరింత డిమాండ్ నెలకొంది. అందులో నల్లరంగులో ఉన్న కోళ్లకు మరింత ఆదరణ పెరిగింది. కార్తె శనివారం ప్రారంభమైనా కొంత మంది మాంసాహారాన్ని తీసుకోకపోవడంతో ఆదివారం తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నల్లరంగులో ఉన్న పొట్టేళ్లు, మేకపోతులను ఇప్పటికే పలువురు కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఆరోగ్యపరంగా చెప్పుకుంటే కోడి మాంసం వేడి చేస్తుందని, తద్వారా శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుందని, సీజనల్‌గా వచ్చే వ్యాధులు రావన్నది అందరికీ తెలిసిందే. ఈ సీజన్‌లో చేపలు తినడం ద్వారా గుండె జబ్బులు, ఆస్థమా రోగులకు ఉపశమనం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చేపలను ఇంగువలో, చింతచిగురులో పెట్టి తీసుకుంటారు.



మృగశిర సందర్భంగా విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

పెరిగిన ధరలు

మృగశిర కార్తె నాడు చేపలకు మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం రెండు, మూడు చేపల ధర అమాంతంగా పెరిగిపోయాయి. చేపల మార్కెట్‌ల్లో శనివారం బొచ్చులు, బంగారు తీగ, చెరువు చేపలు ధరలు భారీగా పెరిగాయి ఒక్కొక్క చేప సైజును బట్టి రూ.150 నుంచి రూ.300 వరకు ఉండగా పెద్ద చేపలు రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయించారు. మృగశిర కార్తె పురస్కరించుకుని చేపల వ్యాపారాలు సైతం ప్రత్యేక ఏర్పాట్లతో విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రాణంలో ఉన్న చేపలను విక్రయిస్తున్నారు.

సాగుకు సన్నద్ధం

రబీ సీజన్ ముగిసి రెండు నెలలు గడుస్తోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభ కానున్న నేపథ్యంలో మృగశిర కార్తె సందర్భంగా రైతన్నలు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సన్నద్ధం అవుతున్నారు. తొలకరి వర్షాలు కురవగానే దుక్కులు దున్నుతారు.

బాలుడి మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

కొత్తపల్లి: అనారోగ్యంతో బాలుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన సూరాడ ప్రదీప్ (14) అనారోగ్యంతో బాధపడుతూ గత నెల 31న ఉప్పాడలో ఓ క్లినిక్‌లో చేరాడు. అక్కడ చికిత్స అనంతరం అదేరోజు రాత్రి బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై ఈ నెల 1న డాక్టర్‌ను నిలదీశారు. ఈ నేపథ్యంలో విషయం బయటకు రాకుండా ఉండటానికి వారితో రూ.5.50 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆ సొమ్ము ఇవ్వకపోవడంతో పాటు క్లినిక్ తెరవకపోవడంపై బాధితులు ఈ విషయాన్ని బయటపెట్టారు.